క్లుప్తంగా

ఆర్టీసీ కార్మికుల నిరసన



ఏలేశ్వరంలో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

ఏలేశ్వరం: కావలి వద్ద ఆటోనగర్ **ఆర్టీసీ డిపో** డ్రైవర్ రామ్‌సింగ్‌పై జరిగిన దాడిని **నిరసిస్తూ** సంస్థ కార్మికులు పట్టణంలో **ఆదివారం** నిరసన తెలిపారు. నల్లబ్యాడ్జీలు ధరించిన కార్మికులు స్థానిక ఆర్టీసీ డిపో ప్రధాన గేటు వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు నిరసన తెలిపామన్నారు. తమ సంస్థకు చెందిన డ్రైవర్‌పై దాడి చేయడం దారుణమన్నారు. ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు యూబీఎం కుమార్, కె.త్రిమూర్తులు, బీఎస్ బాబు, కేఎస్‌కే రావు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ప్రజల ఆరోగ్యం



జి.కొత్తపల్లిలో చెత్తను తొలగిస్తున్న పొక్లెయిన్

శంఖవరం: గ్రామంలో పరిశుభ్రత ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలో ఆదివారం పంచాయతీ సిబ్బంది రోడ్డుకిరువైపులా ఉన్న వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడికలు తీయించి, గ్రామంలో బ్లీచింగ్ చల్లారు. దోమల మందు పిచికారీ చేశారు. గ్రామ పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని సర్పంచ్ కోరారు.

గ్రామ స్థాయిలో బలోపేతం చేస్తాం



తూర్పు లక్ష్మీపురంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఏలేశ్వరం: బీజేపీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ అన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఏనుగు ధర్మరాజు ఆధ్వర్యంలో తూర్పు లక్ష్మీపురంలో ఆదివారం ఇంటింటికీ వెళ్లి కేంద్ర పథకాలపై ప్రచారం చేశారు. రామ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశం పెట్టిందని, బీజేపీ శ్రేణులు పార్టీబలోపేతంపై దృష్టి సారించాలన్నారు. పార్టీ నాయకులు పతివాడ వెంకటేశ్వరరావు, కర్రి ధర్మరాజు, బండారు సూరిబాబు, పలివెల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల సమావేశం

ప్రత్తిపాడు: తెలుగుదేశం పార్టీ ప్రత్తిపాడు కార్యాలయంలో ఆదివారం టీడీపీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న బాబు షూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ గ్యారంటీ, మ్యానిఫెస్టో ప్రచారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు మెట్ల రమణబాబు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శాస్త్రీయ అవగాహన అవసరం



సైన్స్ ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

పెద్దాపురం: ప్రతి విద్యార్థికి శాస్త్రీయ ఆలోచన, ఆచరణాత్మకత ఎంతో అవసరమని సైన్స్ సెంటర్ నిర్వాహకుడు బుద్ధా శ్రీనివాస్ అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు ఏసీటీ సైన్స్ సెంటర్ ఏర్పాటులో భాగంగా భౌతిక, రసాయనిక శాస్త్ర ప్రయోగాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధా శ్రీనివాస్ మాట్లాడుతూ విన్న, చదివిన దానికంటే ప్రయోగాత్మక, ఆచరణీయ అంశాలపై విద్యార్థులు శ్రద్ధ వహించాలని చెప్పారు. పాఠ్యాంశాల్లో చదివిన అంశాలను ప్రయోగం చేయడం ద్వారా విద్యార్థులు మరింత మేధస్సును సాధించవచ్చని పేర్కొన్నారు. అనంతరం పలు సైన్స్ ప్రయోగాత్మక అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రేవతి సైన్స్ ఫౌండేషన్ ప్రతినిధి కృష్ణసాయి, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

రక్షక భటులకు సొంత గూడు

- 28 ఏళ్లుగా అద్దె భవనాల్లోనే విధులు నిర్వహిస్తున్న వైనం
- నవంబర్ ఒకటిన నూతన పోలీస్ స్టేషన్ భవనం ప్రారంభం



కిర్లంపూడిలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న నూతన పోలీస్ స్టేషన్

కిర్లంపూడి: రేయింబవళ్లు ప్రజలకు రక్షణ కల్పించడంలో అహర్నిశలు శ్రమించే రక్షక భటులకు శ్రేష్ఠమైన సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. మారుమూల గ్రామాల మొదలు శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేసే పోలీస్ శాఖకు అన్ని వసతులతో కూడిన, పటిష్టమైన భవనాలు ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తోంది. ఈ నేపథ్యంలోనే కిర్లంపూడిలో 28 ఏళ్లుగా అరకొర సదుపాయాలతో, అద్దె భవనంలో విధులు నిర్వహిస్తున్న పోలీసులు త్వరలో నూతన, శాశ్వత భవనంలోకి అడుగుపెట్టనున్నారు.

కిర్లంపూడి పోలీస్ స్టేషన్ పూర్వాపరాలివీ..

కిర్లంపూడి మండలం ఏర్పాటయ్యాక 1993లో.. కిర్లంపూడి పోలీస్ స్టేషన్ మంజూరైంది. క్షేత్రస్థాయిలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు కాలేదు. కిర్లంపూడి స్టేషన్‌కు నియమించబడిన సిబ్బంది మండలంలో శాంతిభద్రతలను పర్యవేక్షిస్తూ, అన్నవరం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, పెద్దాపురం పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వర్తించేవారు. జీతాలు మాత్రం కిర్లంపూడి పోలీస్ స్టేషన్ పేరునే పొందేవారు. 19 పంచాయతీలతో 56 వేలకు పైబడి జనాభా కలిగిఉండడంతో, మండల కేంద్రమైన కిర్లంపూడిలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ఆ శాఖ ఉన్నతాధికారులు 28 ఏళ్ల కిందట ఆదేశాలిచ్చారు. దీంతో 1995 సెప్టెంబర్ 10న జగపతినగరంలోని ఒక అద్దె భవనంలో పోలీస్ స్టేషన్ నెలకొల్పారు. దాదాపు 16 ఏళ్ల పాటు చాలీచాలని వసతులతో అందులోనే స్టేషన్ కొనసాగుతూ వచ్చింది. 2011 డిసెంబర్ 27న అక్కడ నుంచి జగపతినగరంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని శిథిలావస్థలో ఉన్న ఓ చిన్న భవనంలోకి మార్చారు. ఇప్పటి వరకూ అందులోనే పోలీస్ స్టేషన్ కొనసాగుతోంది. ఈ భవనం లోతట్టు **ప్రాంతంలో ఉండడంతో,** కొద్దిపాటి వర్షానికే పొలాల్లోంచి వచ్చే నీరు నేరుగా పోలీస్ స్టేషన్‌ను ముంచెత్తుతోంది. దీంతో స్టేషన్‌లోని విలువైన ఫైళ్లు, సామగ్రి తడిచిపోతున్నాయి. దీనికితోడు ముంపునీటిలో కొట్టుకొచ్చే సర్పాలు, పురుగులు, దోమలతో పోలీస్ సిబ్బంది, ఖైదీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకూ కనీస వసతులు కరువయ్యాయి.

గతంలో భూమిపూజ చేసినా..!

పోలీస్ స్టేషన్‌కు శాశ్వత భవనం ఉండాలనే ఉద్దేశంతో జగపతినగరం శివారు ఉన్న యల్లపు నర్సయ్య అన్నసత్రం భూముల్లో 10 సెంట్ల భూమి కేటాయించారు. స్టేషన్ భవన నిర్మాణానికి భూమి పూజ కూడా చేశారు. ఆ స్థలం కాస్తా కోర్టు వివాదాల్లో ఉండడంతో భవన నిర్మాణం కార్యరూపం దాల్చలేదు.

రూ.60 లక్షలతో నిర్మాణం

స్థానిక పెద్దలు, ప్రజాప్రతినిధుల ప్రోత్సాహంతో కిర్లంపూడి ప్రభుత్వాస్పత్రి పక్కనున్న 23 సెంట్ల భూమిని పోలీస్ స్టేషన్ నిర్మాణానికి రెవెన్యూ శాఖ కేటాయించింది. కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు చొరవతో, రూ.60 లక్షల ఎస్‌ఆర్‌ఎంటీ వారి సీఎస్సార్ నిధులతో గతేడాది డిసెంబర్ 18న అప్పటి జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబుతో కలిసి ఆధునిక పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. పోలీస్ స్టేషన్ భవన నిర్మాణంలో అవకతవకలకు తావులేకుండా, నాణ్యత లోపించకుండా నిర్మించేలా జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, స్థానిక సీఐ బి.సూర్యఅప్పారావు ఎప్పటికప్పుడు పరిశీలించారు.



మార్కెట్ యార్డు వద్ద ఉన్న ప్రస్తుత పోలీస్ స్టేషన్



వర్షానికి నీట మునిగిన పాత పోలీస్ స్టేషన్ (ఫైల్)



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

అసౌకర్యం కలగకుండా..



పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు అసౌకర్యం కలగకుండా, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో ఈ పోలీస్ స్టేషన్‌ను నిర్మించారు. వచ్చే నెల ఒకటిన పోలీస్ స్టేషన్ ప్రారంభించడానికి ముహూర్తం ఖరారు చేశారు.

– బి.సూర్యఅప్పారావు, సీఐ, జగ్గంపేట

క్రికెట్ టోర్నీ విజేత చేపూరు వారియర్స్



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తుని రూరల్: దివంగత ఎస్సై అల్లు దుర్గారావు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా చేపూరు వారియర్స్ జట్టు నిలిచింది. వారం రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. విజేత జట్టుకు రూ.పది వేల నగదు, జ్ఞాపికను వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు. అల్లు దుర్గారావు స్మారకార్థం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా సహకారంతో ఈ టోర్నమెంట్ నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు. రెండో బహుమతి రూ.ఆరు వేలను వి.కొత్తూరు-బి జట్టు, మూడో బహుమతి రూ.మూడు వేలను చేపూరు కాలనీ జట్టు గెలుచుకున్నాయి. పార్టీ నాయకులు గొర్లి విష్ణు, మల్లు దుర్గాప్రసాద్, బొట్టా అప్పారావు, గొర్లి దేవుడునాయుడు, తుమ్మి దుర్గా పాల్గొన్నారు.

నేడు యర్రయ్యపేటలో ఆరోగ్య సురక్ష శిబిరం

తొండంగి: పేదల చెంతకే వైద్య సేవలందించే లక్ష్యంతో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం సోమవారం మండలంలోని యర్రయ్యపేటలో జరుగుతుందని ఎంపీడీఓ పసుపులేటి సతీష్ తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎంపీయూపీ స్కూల్ ఆవరణలో జరిగే శిబిరంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది సేవలందిస్తారని చెప్పారు.

దంతాల పరిరక్షణ అవసరం



దంత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

జగ్గంపేట: ముఖ సౌందర్యానికే కాకుండా, జీవ ప్రక్రియలో దంతాల పరిరక్షణ ఎంతో అవసరమని దంత వైద్య నిపుణుడు డాక్టర్ కల్యాణ్ అన్నారు. జగ్గంపేట వాకర్స్ హెల్త్ క్లబ్, పెన్షనర్ల సంఘం సంయుక్తాధ్వర్యంలో ఆదివారం స్థానిక పెన్షనర్ల సంఘ భవనంలో ఉచిత దంత వైద్య శిబిరం జరిగింది. రాజమండ్రికి చెందిన కల్యాణ్ డెంటల్ హాస్పిటల్ డాక్టర్లు కల్యాణ్, ఝాన్సీ దంత పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దంత సంరక్షణపై వైద్యులు అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో సుమారు 100 మందికి పరీక్షలు జరిపినట్టు క్లబ్ అధ్యక్షుడు తోలేటి సూర్యనారాయణ తెలిపారు. సంఘ అధ్యక్షుడు వెంకటశాస్త్రి, ప్రధాన కార్యదర్శి ఎం.మల్లేశ్వరరావు, క్లబ్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ సమ్మెట సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రజారక్షణ భేరి పోస్టర్ ఆవిష్కరణ



బస్సు యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బేబీరాణి

కోటనందూరు: కార్మికుల హక్కుల సాధనే లక్ష్యంగా సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టే ప్రజారక్షణ భేరి బస్సు యాత్రను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా నాయకురాలు బేబీరాణి విజ్ఞప్తి చేశారు. ఆదివారం మండలంలోని బొద్దవరంలో బస్సు యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ విజయవాడలో నవంబర్ 15 నుంచి ప్రారంభించే ఈ బస్సు యాత్ర.. అసంఘటిత కార్మికుల హక్కుల సాధనే లక్ష్యంగా సాగుతుందని చెప్పారు. కార్మికులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, రెగ్యులరైజేషన్, ఖాళీ ఉద్యోగాల భర్తీ, పరిశ్రమల స్థాపన ప్రధాన అంశాలని వివరించారు. సీఐటీయూ నాయకులు షేక్ పద్మ, బత్తిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇటుక బట్టీలో అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కిర్లంపూడి: నిర్లక్ష్యంగా కాల్చిపారేసిన సిగరెట్ వల్ల నిప్పంటుకుని ఇటుక బట్టీలో కొబ్బరి పీచు దగ్ధమైంది. జగ్గంపేట ఫైర్ ఆఫీసర్ లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం.. కిర్లంపూడి మండలం తామరాడలో కలవలపల్లి సత్తిబాబుకు ఇటుక బట్టీ ఉంది. ఇటుకలను కాల్చడానికి సిద్ధంగా ఉంచిన కొబ్బరి పీచుకు ఆదివారం నిప్పంటుకుని, మంటలు ఎగసిపడ్డాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని, మంటలను అదుపు చేశారు. సుమారు రూ.50 వేల విలువైన కొబ్బరిపీచు దగ్ధమైంది.

నేడు డయల్ యువర్ కమిషనర్

- అనంతరం స్పందన కార్యక్రమం
- కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు



కాకినాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ నిర్వహిస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. ప్రజలు నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నెంబర్ 0884-2357800కు కాల్ చేసి, తమ సమస్యలు తెలియజేయవచ్చునని, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. 10:30 నుంచి స్పందన యథావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తలుపులమ్మ లోవలో భక్తుల రద్దీ



తలుపులమ్మ అమ్మవారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

రూ.4.38 లక్షల ఆదాయం

తుని రూరల్: లోవ దేవస్థానంలో కొలువై ఉన్న తలుపులమ్మ అమ్మవారి దర్శనాలకు భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన పదివేల మంది భక్తులు అమ్మవారిని క్యూ ద్వారా దర్శించుకున్నట్టు ఆలయ కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల ద్వారా రూ.1,10,580, పూజా టికెట్లకు రూ.1,10,870, కేశఖండన శాలకు రూ.10,080, వాహన పూజలకు రూ.8,930, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెల ద్వారా రూ.67,262, విరాళాల రూపేణా రూ.1,30,292లు మొత్తం రూ.4,38,014 ఆదాయం సమకూరినట్టు ఈఓ తెలిపారు.

బీకేఎస్‌ను పటిష్ట పరచాలి



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణమూర్తి

ప్రత్తిపాడు: భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్)ను జిల్లాలో గ్రామ స్థాయి నుంచి పటిష్టపరచాలని సంఘ కాకినాడ జిల్లా అధ్యక్షుడు గోపు నారాయణమూర్తి కోరారు. ప్రత్తిపాడు మునసబు గారి రామాలయంలో ఆదివారం సాయంత్రం బీకేఎస్ జిల్లా ప్రతినిధుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ యువతను సంఘంలోకి తీసుకురావాలన్నారు. బీకేఎస్ సభ్యత్వాన్ని పెంచాలని సూచించారు. వ్యవసాయాధారిత వృత్తులు చేపట్టిన మహిళలు కూడా సంఘంలో సభ్యులుగా చేరవచ్చని వక్తలు చెప్పారు. సమావేశంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి కొలూరి పతిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాసంశెట్టి రాజా, వేలంక మాజీ సర్పంచ్ నీలగిరి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

నవంబరు 4న భారీగా కోటి బిల్వార్చన



వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

తుని/తుని రూరల్: తుని మండలం వి.కొత్తూరు శివారు 16వ నంబరు జాతీయ రహదారిని ఆనుకుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న ఆకుల వీర్రాజు స్థలంలో నవంబరు నాలుగో తేదీన కోటి బిల్వార్చనకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం తుని కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో నిర్వాహకులు తుని, పాయకరావుపేట విలేకర్లతో మాట్లాడారు. తుని, పాయకరావుపేట పరిసర ప్రాంతాలకు చెందిన అయ్యప్ప దీక్షాపరులు సుమారు 15 వేల మందితో కోటి బిల్వార్చన, పడిపూజ జరపనున్నట్టు వివరించారు. రాష్ట్రం నలుమూలల నుంచి సేకరించిన బిల్వ పత్రాలను ఆరు లారీలతో వేదిక వద్దకు తరలించనున్నట్టు తెలిపారు. ఒకేసారి వేలాది మంది దీక్షాపరులతో స్వామివారికి సామూహిక హారతులిచ్చేలా ఏర్పాట్లు చేశామన్నారు. కాకినాడకు చెందిన వేలు గురుస్వామి, నాట్యాచార్య డాక్టర్ కృష్ణమోహన్ పర్యవేక్షణలో ఆ రోజు సాయంత్రం ఐదు నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. సంప్రదాయబద్ధంగా కోటి బిల్వార్చన, పడిపూజ నిర్వహించేందుకు శబరిమల ఆలయ ప్రధానార్చకులు, పందళరాజ వంశీకులు, 70 ఏళ్లుగా మకర సంక్రాంతి రోజున స్వామివారి తిరువాభరణాలను ఆలయానికి తీసుకెళ్తున్న పిళ్ళై, మరో 40 మంది కేరళ చండై వాద్యకారులు హాజరవుతున్నట్టు వివరించారు. నిర్వాహక ప్రతినిధులు చంటిస్వామి, దాసరి బాబ్జి, తటవర్తి సూరిపండు, పోతుల రమేష్ మురళి తదితరులు పాల్గొన్నారు.

కాలువలకేదీ మోక్షం..!



సింహాద్రిరాజు పంట కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు



అప్పన్నపాలెంలో అధ్వానంగా ఉన్న ప్రధాన డ్రైన్

కిర్లంపూడి: చిల్లంగి శ్రీనివాసనగర్‌లో కుమారస్వామి ఆలయం వద్ద సింహాద్రిరాజు పంట కాలువ వ్యర్థాలతో పూడిపోయింది. వ్యర్థాలు భారీగా పేరుకుపోవడంతో తూము కానుల వద్ద పూడిక ఏర్పడింది. కాలువ నుంచి నీరు ముందుకు పారడం లేదు. దీనిద్వారా సుమారు 3,500 ఎకరాలకు సాగునీరు సరఫరా అవుతోంది. వ్యర్థాలతో కాలువ పూడిపోయి, శివారు పంటలకు నీరందడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పంట కాలువ పూడికలు తొలగించాలని కోరుతున్నారు.

అప్పన్నపాలెం ప్రధాన డ్రైన్ అధ్వానం

ఏలేశ్వరం: పట్టణంలోని అప్పన్నపాలెం మెయిన్ రోడ్డుపై ప్రధాన డ్రైన్ అధ్వానంగా మారింది. డ్రైన్ పూడిపోవడంతో రోడ్డుపై మురుగు నీరు పారుతోంది. డ్రైన్‌పై శ్లాబులు పైకి ఉండడంతో.. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మంటలు చెలరేగి స్కూటీ దగ్ధం

పిఠాపురం: భార్యాభర్తలు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనంలో మంటలు చెలరేగిన సంఘటన ఆదివారం సాయంత్రం గొల్లప్రోలు సమీపంలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో స్కూటీ పూర్తిగా దగ్ధం కాగా, భార్యాభర్తలు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గొల్లప్రోలుకు చెందిన దంపతులు సత్యనారాయణ, వెంకటలక్ష్మి స్కూటీపై పిఠాపురానికి బయలుదేరారు. గొల్లప్రోలు శివారు చేరుకునేసరికి స్కూటీ నుంచి పొగలు వచ్చాయి. అపాయాన్ని పసిగట్టిన సత్యనారాయణ వెంటనే వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి, భార్యను కిందకు దించేశారు. క్షణాల్లో మంటలు చెలరేగి, వాహనం దగ్ధమైంది. పిఠాపురం అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు.



మంటల్లో దగ్ధమవుతున్న వాహనం

గోపాలపట్నం రహదారి గోతులమయం

తొండంగి: మండలంలోని గోపాలపట్నం నుంచి తొండంగి వెళ్లే రహదారిలో బైపాస్ అండర్‌పాస్ బ్రిడ్జి ప్రాంతం గోతులమయం కావడంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నీటి నిల్వ కారణంగా ఈ ప్రాంతంలో రహదారి అధ్వానంగా మారింది. గోతులు సరిగ్గా కనిపించక పోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారిపై గోతులను పూడ్చేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

యువతి అదృశ్యం

కాకినాడ రూరల్: మండలంలోని తూరంగి అల్లూరు సీతారామరాజు డ్రైవర్స్ కాలనీకి చెందిన యువతి అదృశ్యంపై ఇంద్రపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంటర్మీడియట్ వరకు చదివిన ఆమె ఈనెల 27వ తేదీ రాత్రి నుంచి కనిపించడం లేదని తండ్రి సూరిబాబు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై లక్ష్మణ స్వామి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తీరంలో తుళ్లింత



ఉప్పాడ బీచ్‌లో కేరింతలు కొడుతున్న పర్యాటకులు

కొత్తపల్లి: ఉప్పాడ సాగర తీరం ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. చిన్నా పెద్దా అంతా కడలి కెరటాల్లో కేరింతలు కొట్టారు. కొత్తపల్లితో పాటు పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి వచ్చారు. తుని సమీపంలో తలుపులమ్మతల్లి లోవ అమ్మవారి దర్శనానికి వెళ్లిన భక్తులు, తిరుగు ప్రయాణంలో ఇక్కడి తీరానికి చేరుకున్నారు. పెద్దలు, పిల్లలు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. పర్యాటకుల రాకతో వాహనాల సంఖ్య అధికంగా ఉండడం వల్ల కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బెంచీలు, తాగునీరు అందుబాటులో లేకపోవడంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.